

మైనింగ్ సరిహద్దుల ఏర్పాటుకు సర్వే


సర్వే ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - డి .హీరేహాల్

మండలంలోని ఓబులాపురం గ్రామ పరిధిలో ఉన్న ఇనుపగనుల్లో లీజు సరిహద్దులు ఏర్పాటుకు సర్వే నిర్వహిస్తున్నట్లు మైన్స్ అండ్ జియాలజీ జెడి శ్రీనివాసరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి ఛైర్మన్‌గా ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ సెంట్రల్ సర్వే ఆఫ్ ల్యాండ్ అండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎంఒయుఎఫ్ సభ్యులు, కేంద్ర సి ఈ సి సభ్యులు, మైన్స్ అండ్ జియాలజీ సభ్యులు, అటవీ శాఖ సభ్యులతో కలిసి గురువారం నుండి మైనింగ్ లీజుల సరిహద్దులు సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ గురువారం మైనింగ్ ప్రాంతానికి వస్తుండడంతో ఈ ప్రాంతాన్ని పరిశీలించడానికి వచ్చినట్లు జెడి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడి శ్రీనివాస్ చౌదరి, అటవీశాఖ అధికారులు రామచంద్రారెడ్డి, దామోదర్, మండల సర్వేయర్ రవితేజ, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయల్టీ ప్రయివేటుపరం... కార్మికులకు శాపం


నాపరాయిని పాలిష్ చేస్తున్న కార్మికులు

నిలిచిపోయిన నాపరాతి గనుల పనులు

ఇబ్బందుల్లో కార్మికులు

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

తాడిపత్రి అనేక పరిశ్రమలకు నెలవు. వ్యవసాయం తర్వాత నియోజకవర్గంలో నాపరాతి పరిశ్రమల ద్వారానే ఎన్నో వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. తాడిపత్రికి ఆనుకుని ఉన్న నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల, అవుకు తదితర ప్రాంతాల నుంచి రోజుకు ఎన్నో వందల ట్రాక్టర్లు, లారీలతో నాపరాతి గనుల నుంచి టన్నులకొద్దీ నల్లబండలు దిగుమతి అవుతుంటాయి. దీంతో నిత్యం నాపరాతి పరిశ్రమలు కలకలలాడుతూ ఉండేవి. అయితే ప్రభుత్వాలు రాయితీలు పెంచుతూ పన్నులు విధిస్తూ ఉండటంతో ఇక్కడ ఉన్న నాపరాతి పరిశ్రమలు డీలా పడుతున్నాయి. ప్రభుత్వాలకు రాయితీలు పన్నులు చెల్లించలేక రోజురోజుకు సన్నగిల్లి పోతూ ఉన్నాయి ఈ పరిశ్రమలలో పనిచేసే వేలాదిమంది కార్మికులు జీవనోపాధిగా ఉన్న ఈ పనిని వదులుకోలేక అరకొరగానే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు అయితే ఎన్నో ఆశలు పెట్టుకున్న కూటమి ప్రభుత్వం కూడా ప్రస్తుతం నాపరాతి పరిశ్రమలపై ఏమాత్రం దయ చూపడం లేదు. ఇటీవల ప్రభుత్వం నాపరాళ్ళు ఇతర ఖనిజాలు ఎగుమతి చేసేందుకు వసూలు చేసే సీనరేజ్ రాయల్టీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో కాస్త కూస్తో నడుస్తున్న నాపరాతి పరిశ్రమలు పూర్తిగా నిలిచిపోయాయి దీంతో పరిశ్రమలను నమ్ముకుని ఉన్న వేలాది కార్మికులు, వాటి ఆధారంగా ఉన్న ట్రాక్టర్లు, లారీలు, వాటి డ్రైవర్లకు ఉపాధి కరువైంది. కార్మికులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలో ఉన్న కార్మికులను రాయల్టీని ప్రైవేటీకరించడం వల్ల మరింత కష్టాల్లోకి నెట్టేసినట్లయింది. రాయల్టీ ప్రైవేట్ పరం చేసుకున్న సంస్థలు ఈనెల 8 నుంచి రాయల్టీ వసూలు చేసేందుకు రంగంలోకి దిగాయి. నాపరాళ్లను రవాణా చేసేందుకు టన్నుకు రూ.222 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో గనుల పరిశ్రమల యజమానులు ఎక్కడికక్కడే ట్రాక్టర్లను నిలిపేశారు. ప్రతిరోజు పక్కన ఉన్న నంద్యాల జిల్లా నుంచి దాదాపు 300 ట్రాక్టర్ల ద్వారా నాపరాళ్లు అనంతపురం, తాడిపత్రితో పాటు పలు ప్రాంతాలకు రవాణా జరిగేవి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. పది రోజులు దాటినా 20 ట్రాక్టర్లు కూడా రవాణా చేయకపోవడం గమనార్హం. పనులు లేక వేలాదిమంది కార్మికులు ఖాళీగా ఉన్నారు, పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాదిమంది కార్మికులు వారి కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి ఈ పరిశ్రమలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నవారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గనుల్లో వెలికి తీసిన నాపరాళ్లు ఎగుమతి లేక నిలిచిపోయాయి. ఇక పాలిష్ ఫ్యాక్టరీలకు నాపరాళ్లు చేరకపోవడంతో కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. వందలాదిమంది కార్మికులు రోజువారిగా లోడింగ్ అన్లోడింగ్ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. యజమానులు అప్పులు చేసి గనుల తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్లు ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణాలు తెచ్చుకొని వాయిదాల రూపంలో నెల నెల చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం రవాణాకు ఆటంకం కలగడంతో వచ్చే నెల వాయిదాలు ఎలా కట్టాలో ట్రాక్టర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో ఏమాత్రం ధర డిమాండ్ లేని నాపరాళ్లపై ప్రభుత్వం కక్షగట్టి రాయల్టీని ప్రైవేటుపరం చేయడం దారుణమని పరిశ్రమల యజమానులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాయల్టీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని నాపరాళ్ల గనుల యజమానులు కార్మికులు ఎదురుచూస్తున్నారు.

పనుల్లేక ఇబ్బందుల్లో ఉన్నాం

పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎన్నో సంవత్సరాలుగా ఈ పనిని నమ్ముకున్నా. అరకొరగా సాగే ఈ పనులపై కూడా ప్రభుత్వం రాయితీలు విధించడం సరికాదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న కూటమి ప్రభుత్వం రాయల్టీని తగ్గించి గనుల నుంచి సరుకు పరిశ్రమలకు యధావిధిగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ వృత్తిని నమ్ముకుని వేలాదిగా ఉన్న మాలాంటి కార్మికులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

లక్ష్మీనారాయణ,
నాపరాళ్ల పాలిష్ కార్మికుడు

పెంచిన రాయల్టీని తగ్గించాలి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రాయల్టీని తగ్గించి కార్మికులను ఆదుకోవాలి. ఇండస్ట్రియల్ హబ్ గా చేస్తామన్న కూటమి ప్రభుత్వం అదే పరిశ్రమలపై రాయల్టీ వసూలు చేయడాన్ని ప్రైవేటుపరం చేయడం దారుణం. ఈ వృత్తిని నమ్ముకొని ఇక్కడ వేల సంఖ్యలో కార్మికులు ఉన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలి.

నరసింహారెడ్డి,
సిఐటియు నాయకులు , తాడిపత్రి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాపంపేట బాధితులకు భద్రత కల్పించాలి

బాధితులకు అండగా సిపిఎం

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పాపం పేట గ్రామం లోని 15 వేల కుటుంబాలకు భద్రత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాంభూపాల్‌తో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. శ్రీనివాసులు, ఎస్ .నాగేంద్ర కుమార్, ఎం .బాల రంగయ్య, వి. సావిత్రి, వి.రామిరెడ్డి ,ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, ఎం. కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి .రాంభూపాల్ మాట్లాడుతూ పాపంపేట స్థలాలపై జరుగుతున్న సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాపం పేట గ్రామంలోని శోత్రియం భూమి 932 ఎకరాలకు చెందిన భూమిలో అనేక సంవత్సరాలుగా భూమిని కొనుక్కొని ప్లాట్లు వేసుకుని వివిధ బ్యాంకులు ,వ్యక్తుల దగ్గర అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టి కాపురాలు ఉంటున్న వారిపై జిపిఏ ఉందనే పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయాల్సిన జిల్లా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. పాపం పేట భూ మాఫియాకు అండగా ఉంటున్న సబ్ రిజిస్టర్, మండల తహశీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాలలో ఉన్న లొసుగులను వాడుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మండల సర్వేయర్ రఘునాథ్ చేసిన తప్పుడు సర్వేల రిపోర్టులను తహశీల్దార్ ఆమోదించడం వీటిని ఆధారం చేసుకుని సోత్రీయం భూములకు హక్కులు ఉన్నాయని జిపిఎను పొందడం జరిగిందన్నారు. అయితే సోత్రియం భూములకు చెందిన భూ యజమానులు వివిధ వ్యక్తులకు అమ్మిన వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. వీటి వెనుక పాలక పార్టీలకు చెందిన వారు ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పాపంపేట బాధితుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కష్టార్జితంతో ఏర్పాటు చేసుకున్న తమ అవాసాలను నిలుబెట్టుకోవడానికి బాధితులు చేస్తున్న పోరాటానికి సిపిఎం మద్దతిస్తోందన్నారు. భూ మాఫియా చేస్తున్న అరాచకాలను బాధితులు ఐక్యంగా పోరాటం చేస్తే హక్కులను సాధించుకోవచ్చన్నారు. హక్కుల సాధన కోసం వారు చేస్తున్న పోరాటానికి సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని అందులో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని సిపిఎం నాయకులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచారం నిరోధక చట్టం జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అర్బన్ దగ్గుపాటి ప్రసాద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిజమైన బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలను ఏర్పాటు చేసేందుకోసం సర్వే చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఉద్యోగాల నియామకాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా చట్టం ప్రకారం అమలు చేయాలన్నారు. ఎస్పి పి.జగదీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూజిల్లాలో ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ లో ఎక్కడైనా ఆర్ఓ ప్లాంట్లు అవసరమైతే వాటిని ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నగరంలో శానిటేషన్ వ్యవస్థ గతం కంటే మెరుగుపడిందని.. దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. గత ఐదేళ్లలో టిడ్కో ఇళ్ల నిర్మాణం సాగలేదన్నారు. రెండు వారాల్లో టిడ్కో గృహ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు దాస్, యల్లన్న, సాకే చిరంజీవి, ఇమామ్ వలీ, శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టులో రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఏ.మాలోల, సోషల్ వెల్ఫేర్ జెడి ఖుష్బూ కొఠారి, ఆర్డీవోలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, డీఎస్పీలు, డివిఇఒ, జడ్పీ సీఈవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు, ప్రత్యారోపణలతో దద్దరిల్లిన 'అనంత' కౌన్సిల్


ఎమ్మెల్యే, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

మద్యంషాపులపై గంటల తరబడి వాదోపవాదాలు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం వైసీపీ పాలకవర్గం కూటమి ప్రజాప్రతినిధుల నడుమ ఆరోపణలు ప్రత్యారోపణలతో దద్దరిల్లింది. తెల్లవారుజామునే మందు షాపులు తెరవడం వలన పారిశుధ్య పనులకు ఆటంకం కలుగుతుందన్న అంశంతో ప్రారంభమైన చర్చ గంటల తరబడి కొనసాగింది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తో పాటు సభ్యుడు కానీ పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సమావేశానికి హాజరయ్యారు. నగరంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కనీస సమాచారం నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు తెలపాలన్న ప్రోటోకాల్‌ను కమిషనర్ పాటించటం లేదని సభాధ్యక్షులు, మేయర్ మహమ్మద్ వసీం సలీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహిస్తున్నా పనులు జరిగేలా చర్యలు చేపట్టడం లేదన్నారు కాంట్రాక్టర్ల బిల్లులకు సంబంధించి కమిషన్ లాగిన్ లోనే పెండింగ్లో ఉండిపోవటంతో పనులు చేయటానికి ముందుకు రాని పరిస్థితి నెలకొందన్నారు. మేయర్ కార్పొరేటర్లు సూచించిన పనులు కూడా జరిగేలా చూడటం లేదన్నారు అలాగే నగరంలో తెల్లవారుజామున మందు షాపులు తెరవడం వల్ల మద్యంప్రియులు గొడవలు సృష్టిస్తున్నారని వీధులలో మహిళలు పిల్లలు తిరగలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యేతో వైసిపి కార్పొరేటర్లు వాగ్వాదానికి దిగారు. ఈ అంశంపైనే గంటన్నరకు పైగా చర్చ కొనసాగింది నగరంలో వర్షాలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని వాటి నివారణకు సత్వరం శాశ్వత పరిష్కార మార్గం కనుగొనాలని సభ్యులు కోరారు. అజెండాలోని అంశాల కన్నా నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కన్నా ఇతర అంశాలపైనే గంటల తరబడి చర్చ జరగడంతో ప్రజా సమస్యలు మరుగున పడినట్లు అయింది

కౌన్సిల్ హాల్లోకి దూసుకొచ్చిన సిపిఎం నాయకులు


సిపిఎం నాయకులను బయటకు తీసుకెళుతున్న పోలీసులు

అనంతపురం నగరంలోని రహదారులు గుంతల మయంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే చిన్నపాటి వర్షానికి కూడా లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అవలంభిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలోకి సిపిఎం నాయకులు దూసుకు వచ్చారు, నడిమి వంకకు వచ్చిన వరదలతో రెండు సంవత్సరాల క్రితం ఐదో రోడ్డు సోమనాథ్ నగర్ రజక నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయాని పేదలు ఉప్పు పప్పు బియ్యంతో సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డారని గుర్తు చేశారు. నడిమి వంక ప్రొటెక్షన్ వాళ్లకు సంబంధించిన నిధులు గత పాలకవర్గం హయాంలో మళ్ళించటంతో ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని అన్నారు. తిరిగి ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని పాలకులు చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రెండు రోజుల క్రితం వచ్చిన వర్షంతో లోతట్టు కాలనీలు జలమయమయ్యాయన్నారు వరదలు వచ్చిన సమయంలో వంకలలో పూడికతీత పనులు హడావుడిగా చేపట్టడమే కానీ శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి కషి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి రహదారులు నిర్మించామని గొప్పలు చెప్పటమే కానీ ప్రధాన రహదారులన్నీ గుంతలు ఏర్పడి కంకర తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రజా సమస్యలను చర్చించి నిర్ణయం తీసుకునే కౌన్సిల్లో ఆ దిశగా చర్చలు సాగకపోగా పరస్పర ఆరోపణలకే పరిమితమవుతున్నారని ధ్వజమెత్తారు.

కార్మిక సమస్యలపై సిఐటియు వినతి : కార్మిక సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎంపీ ఎమ్మెల్యే మేయర్‌కు వినతిపత్రం సమర్పించారు. పారిశుద్ధ విభాగం లో విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేశు, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు నారాయణ, ఎర్రి స్వామి. రాఘవేంద్ర ప్రసాద్, వరలక్ష్మి, ప్రజానాట్యమండలి పుల్లన్న, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

అవినీతి నిర్మూలనకు ముందుకు రావాలి

ఎసిబి సిఐ హమీద్‌ఖాన్

ప్రజాశక్తి-గుత్తి



మాట్లాడుతున్న ఎసిబి సిఐ హమీద్‌ఖాన్

సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అవినీతి నిరోధక శాఖ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హమీద్‌ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అవినీతి నిర్మూలన, ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన అందరి చేతుల్లోనే దేశాభివృద్ధి ఉందన్నారు. న్యాయం నిలబడాలంటే అవినీతిని నిరోధించాలన్నారు. ర్యాగింగ్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదరంపల్లి టోల్ గేట్ ప్రారంభం

వాహనదారులు ఆగ్రహం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్


టోల్‌ప్లాజా వద్ద డబ్బు చెల్లిస్తున్న వాహనదారులు

రాయదుర్గం–అనంతపురం జాతీయ రహదారి 544 డిడికి సంబంధించి కదరంపల్లి వద్ద ఉన్న బుధవారం టోల్‌గేట్‌ను ప్రారంభించారు. దీంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయదుర్గం మండల పరిధిలోని కదరంపల్లి వద్ద టోల్‌గేట్ ఉంది. కర్ణాటకలోని హానగల్–అనంతపురం జాతీయ రహదారి ఎన్‌హెచ్ 544 డిడి పూర్తి కాకపోయినప్పటికీ టోల్ గేట్ రుసం వసూలు చేయడంపై వాహనదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం నుంచి రాయదుర్గం వరకు రోడ్డు పూర్తి అయింది. అయితే రాయదుర్గంలోని కోతిగుట్ట వెనుక ఉన్న రైల్వేక్రాస్ బ్రిడ్జి (రైలు బ్రిడ్జిపై వంతెన బిగించలేదు) నిర్మాణం పూర్తి కాలేదు. ఈనేపథ్యంలో హడావుడిగా టోల్ వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై టోల్‌గేట్ మేనేజర్ శేఖర్‌రెడ్డిని వివరణ కోరగా తక్కువ రుసంతోనే టోల్‌గేట్‌ను ప్రారంభించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడంతో ప్రారంభించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

ఆధార్ ఆధారంగానే ఎరువులు విక్రయించాలి : జెడిఎ

ప్రజాశక్తి-అనంతపురం

ఎరువులు డీలర్లు కచ్చితంగా రైతుల ఆధార్ ఆధారంగా ఒటిపి వచ్చిన తర్వాతనే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. బుధవారం స్థానిక కృషి భవన్‌లో ఫర్టిలైజర్ డీలర్స్, రైతు సేవా కేంద్ర సిబ్బందికి కొత్తగా మారిన డిబిటి ఆప్షన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిబిటిలో కొత్తగా మార్పులు వచ్చిన నేపథ్యంలో డీలర్లు కచ్చితంగా ఒటిపి ద్వారా వారి పంటకు కావాల్సిన సబ్సిడీ ఎరువులను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జిఎం అల్తాఫ్ అలిఖాన్, మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటకుమార్, ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సిపి బ్రౌన్ జయంతి అధికారిక నిర్వహణపై హర్షం

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు సూర్యుడిగా పేరుపొందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సిపి బ్రౌన్) జయంతిని ప్రతి నవంబర్ 10వతేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించడంపై పలు సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ఇంగ్లీషు, ఇంగ్లీష్ తెలుగు నిఘంటువులు రచించి, వేమన పద్యాలను తొలిసారిగా వెలుగులోకి తెచ్చిన ఘనత సిపి బ్రౌన్‌కు దక్కుతుందన్నారు. అలాంటి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించడంపై ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విమలా శాంతి సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ, ఉమ్మిడిశెట్టి సాహితీ ట్రస్టు, అనంతపురం జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, స్పందన అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి, కవి సమ్మేళనం, మహాబోధి, వేమన విజ్ఞాన కేంద్రం, సాహిత్య భారతి, తెలుగు భాషా పరిరక్షణ వేదిక, గుర్రం జాషువ సాహిత్య పీఠం మొదలైన సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తిగతంగానే కొత్తూరులో ఘర్షణ

డీఎస్పీ రవిబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామంలో జుంజరప్ప జాతర సందర్భంగా రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణకు ఎలాంటి రాజకీయ సంబంధం లేదని డీఎస్పీ రవిబాబు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో సిఐ హరినాథ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం పాతలింగ, నరేష్ మద్యం తాగి బైక్‌లో తిరుగుతూ మరోవర్గానికి చెందిన ఊరుబావి గోవిందప్ప, అతని భార్యపై అసభ్య పదజాలంతో మాట్లాడారన్నారు. ఇదే విషయమై గోవిందప్ప, ఆయన అనుచరులు పాతలింగ ఇంటివద్దకు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని అడిగేందుకు వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి రాళు రువ్వుకొని కట్టెలతో దాడి చేసుకున్నారన్నారు.


విలేకరులతో మాట్లాడుతున డీఎస్పీ రవిబాబు

ఈవిషయంలో పాతలింగతోపాటు ఆయన వర్గానికి చెందిన ఆరుగురికి గాయాలు కాగా అనంతపురంలో చికిత్స పొందుతున్నారన్నారు. అలాగే గోవిందప్ప, వర్గీయులు కళ్యాణదుర్గం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వ్యక్తిగతంగా ఘర్షణ పడ్డారేతప్ప రాజకీయ కక్షలు ఏమీ లేవన్నారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందగానే విచారణ చేపట్టి కేసులు నమోదు చేస్తామన్నారు.

గుట్టపై సచివాలయ నిర్మాణం బాధాకరం

కుందుర్పి : గుట్టపై సచివాలయాన్ని నిర్మించి సామాన్యులను నానా ఇబ్బందులు గురి చేయడం చాలా బాధాకరమని టిడిపి మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, ఆయకట్టు ఛైర్మన్ రామ్మూర్తినాయుడు, పట్టణ కన్వీనర్ రంగనాథ్, మహేష్ అన్నారు. ఈమేరకు సచివాలయం నిర్మాణంపై ఎంపిడిఒ మాధవితో టిడిపి నాయకులు బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గ్రామం చివరలో గుట్టపై సచివాలయాన్ని నిర్మించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎంపి, ఎమ్మెల్యేకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం నగరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎంపి, ఎమ్మెల్యే, మేయర్‌కు సమస్యలను వివరించారు. ముఖ్యంగా పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అనారోగ్యాల సమస్యలతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, పెరిగిన నగరానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, అడిషనల్ కార్మికులకు పని భద్రత కల్పిస్తూ, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేశు, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు నారాయణ, ఎర్రిస్వామి, రాఘవేంద్ర ప్రసాద్, వరలక్ష్మి, పెన్నా, ఇమాంబి, జయరాం, నల్లప్ప, ప్రజానాట్యమండలి పుల్లన్న, నాగేంద్ర, కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, అరుణమ్మ, భవాని, తదితరులు పాల్గొన్నారు.


మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

'దుర్గం' మార్కెట్ యార్డులో పశువులు, గొర్రెల సంత

ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

రైతుల శ్రేయస్సు కోసం కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో ప్రతి శుక్రవారం పశువులు, గొర్రెలు, మేకల సంత నిర్వహించనున్నట్లు యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో ఈనెల 31వతేదీన పశువుల సంతను ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పటి నుంచి ప్రతి శుక్రవారం సంత ఉంటుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి పశువులు, గొర్రెలు, మేకలు అమ్ముకోవడానికి, కొనడానికి ఇబ్బంది పడటంకన్నా స్థానికంగానే సౌకర్యాలు కల్పించడం మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా కంబదూరు మండలం నూతిమడుగులో ధ్వంసమైన బ్రిడ్జిపై మాజీ ఎంపీ రంగయ్య చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ఎవరూ అధికారంలో ఉన్నప్పుడు బ్రిడ్జి కొట్టుకుపోయింతో తెలుసుకోవాలని హితువు పలికారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, డైరెక్టర్లు కుబేర్ యాదవ్, రైతులు రమేష్, ఒంటిమిద్ది సత్తి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి

పోలీసుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి-అనంతపురం

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో 'పోలీసుల త్యాగాలు' అనే అంశంపై బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థులు, పోలీసు సిబ్బందికి సెమినార్ నిర్వహించారు. ఇందులులో భాగంగా ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన వక్త అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ అమరవీరుల దినోత్సవం ప్రాముఖ్యత, పోలీసుల సేవలు, త్యాగాలను గురించి వివరించారు. పోలీసులను చూసే విధానాన్ని మార్చుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బూల్, రమేష్‌నాయక్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


గుత్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

తాడిపత్రిలో వైద్యశిబిరం

తాడిపత్రి రూరల్ : విధి నిర్వహణలో అమరులైన పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి అన్నారు. పోలీసు అమరవీరులు దినోత్సవ వారోత్సవాల్లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పోలీసులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తికి రక్తం ఇస్తే పునర్జన్మ ఇచ్చిన వారవుతారన్నారు. రక్తదానం చేసిన వారికి ఎఎస్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ రూరల్ సిఐలు ఆరోహణరావు, శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐలు గౌస్‌బాషా, ధరణిబాబు, తాడిపత్రి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గుత్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ

గుత్తి : అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ కె.సురేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గుత్తిలో పోలీసులు, విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి గాంధీ కూడలి వరకూ కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ జి.హనుమంతు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

31న ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో ఈనెల 31వతేదీన పశుఉచిత గర్భకోశ, వ్యాధి నివారణ చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పశు వైద్యశాల ప్రాంతీయ సహాయక సంచాలకులు డాక్టర్ ఎవి రత్నకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఎదకురాని పశువులు, గర్భకోశ సంబంధిత వ్యాధులకు ప్రత్యేక చికిత్స చేయనున్నట్లు తెలిపారు. అలాగే పశువుల్లో లింగ నిర్ధారిత వీర్యంతో చూడు కట్టించడం వల్ల కేవలం ఆడ దూడలు పుట్టే పథకం గురించి వివరించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-గుత్తి

తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని వైసిపి ఐటి జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారంమండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వైసిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, కొర్ర పంటలు దెబ్బ తిన్నాయన్నారు. పంటల సాగులో అరకొర దిగబడులతో కుదేలవుతున్న రైతులకు తుఫాన్‌తో నిండా మునిగారన్నారు. పండ్ల తోటల రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు హరినాథ్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, ఎల్ఐసి హరినాథ్‌రెడ్డి, మురళి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విద్యార్థి దశ నుంచి సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి-2 కోదండరాములు సూచించారు. బుధవారం రాయదుర్గం కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గుమ్మఘట్ట మండలంలోని నేత్రపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సామాజిక స్పృహ, వ్యసనాలతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వివిధ రోగాలపై వివరించారు. మురికి కాలువలు శుభ్రం చేసుకోవాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. గుమ్మఘట్ట మండలం 75 వీరాపురంలో మరో శిబిరం ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీరాములు, వాణిజ్య అధ్యాపకులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం పారా మెడికల్ డిప్లొమా కోర్సులో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ పారామెడికల్ కోర్సుల్లో 150 సీట్లకు 130 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మిగిలిన సీట్ల భర్తీకి అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 7వతేదీ నుంచి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. పారామెడికల్ ప్రయివేట్ కళాశాలల సీట్ల కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం, ప్రభుత్వ మెడికల్ కళాశాలల సీట్ల భర్తీకి మెడికల్ కళాశాలలో సంప్రదించాలని డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ఎఓ గిరిజా మనోహర్‌రావు, సీనియర్ అసిస్టెంట్లు అశోక్‌కుమార్, రాజేష్, రంగనాథ్, కమలాకర్‌రాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని బొప్పేపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబులేశ్వరస్వామి కోనలో నూతన ఆలయ నిర్మాణానికి 15 గ్రామాలకు చెందిన భక్తులు విరాళాలు ప్రకటించారు. బుధవారం స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ రోజురోజుకూ ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. అయితే ఆలయం చిన్నది కావడం, సరైన వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున ఆలయంలో వసతులు కల్పించేందుకు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి రూ.15 లక్షలు, యల్లనూరు గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం నేతలు రూ.15లక్షలు, ధర్మవరానికి చెందిన టి.ఎస్.రామన్న కుమారుడు సంజీవ, భార్య రేణుక రూ.10 లక్షలు, తాడిపత్రికి చెందిన ఆర్యవైశ్యులు ప్రతి కుటుంబం రూ.లక్ష విరాళాలను ప్రకటించారు.

జాతీయ త్రోబాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

గుజరాత్‌లో నిర్వహించిన 33వ జూనియర్ బాలుర జాతీయ త్రోబాల్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో గాండ్లసంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు లలితమ్మ రామ్మోహన్ కుమారుడు రంజిత్ కుమార్ అత్యంత ప్రతిభ కనబరిచాడు. పోటీలు ముగించుకొని విచ్చేసిన క్రీడాకారులు రంజిత్‌కుమార్, ప్రభువరమ్ నాయక్, సాజిద్‌హుస్సేన్ , బాలికల విభాగంలో దర్శితారెడ్డి, ఎం.ప్రీతి, హర్షితకు బుధవారం అనంతపురం రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీ బిఎన్ఆర్ కాలనీలో రంజిత్‌కుమార్ తల్లిదండ్రులు, పెదనాన్న రెడ్డివారి నెహెమ్యా నాగరాజు దంపతులు, కాలనీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు రంజిత్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రంజిత్‌కుమార్ తల్లిదండ్రులు లలితమ్మ, రామ్మోహన్, టిడిపి జిల్లా నాయకులు రాయల్ మధు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

రాయదుర్గం : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పరిధిలో ఉన్న 32 ఎన్నికల వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు, ఇంటి నెంబర్లు, వాటి హద్దు, పరిధి, ఓటర్ల జాబితా రూపకల్పన, తదితర అంశాలపై సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి బుధవారం తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల విభజన, ఓటర్ల జాబితా పరిమితి మొదలైన విషయాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్పష్టమైన ఆధారాలతో దరఖాస్తు చేయాలని కోరారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ బూత్ స్థాయి అధికారి ప్రతి వారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్, బీఎల్వోలు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కళ్లు తెరిపిద్దాం

మాజీమంత్రి డాక్టర్ శైలజానాథ్-వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-నార్పల

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాలు సేకరించి ప్రభుత్వ కళ్లు తెరిపిద్దామని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీమంత్రి డాక్టర్ శైలజనాథ్, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని గడ్డంనాగేపల్లి, కర్ణపుడికి గ్రామాల్లో మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ 17 వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా వైద్య కళాశాల నిర్మాణాలు చేపడితే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, శంకర్‌యాదవ్, కాటమయ్య, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, కుల్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, రమణకుమారి, దాడితోట బాషా, అమీర్‌బాషా, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, గుత్తి గోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, ముచ్చుకుంటపల్లి శ్రీరామిరెడ్డి, వెంకట నారాయణరెడ్డి, మంగపట్నం శివారెడ్డి, దుగుమరి నారాయణరెడ్డి, గూగూడు శివయ్య, శివశంకర్‌రెడ్డి, సోహెల్, నౌషాద్, దాదాపీర్, హరినాథ్‌రెడ్డి, గవ్వల సాయి, మహేష్‌నాయక్, గవ్వల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : కూటమి నాయకులు ప్రజల సొమ్ము దోచుకునేందుకే రాష్ట్రంలో పిపిపి విధానం ద్వారా వైద్య కళాశాలలను ప్రయివేటీకరించేందుకు ప్రభుత్వం పూనుకుందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని శ్రీపురం, బసినేపల్లి, బసినేపల్లి తండా, లచ్చానుపల్లి, ఊటకల్లు, బేతాపల్లి గ్రామాల్లో ప్రజాఉద్యమం, కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, సి.మల్లయ్యయాదవ్, సివి.రంగారెడ్డి, రామరంగారెడ్డి, డి.మైనుద్దీన్, గోపీనాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎ.సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మహాలింగ, సి.రాముయాదవ్, సి.సునీలాయాదవ్, అబ్దుల్ భాషిద్, లాలూనాయక్, జగన్‌నాయక్, కౌన్సిలర్లు వరద, వాల్మీకి శివ, సర్పంచులు ఎ.లహరి రెడ్డి, మహబూబ్‌బి పాల్గొన్నారు.



నార్పలలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

పామిడి : ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక పంచాయతీలోని 9, 10, 13, 14, 17వ వార్డుల్లో వైసిపి పట్టణ వైసిపి కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనుంపల్లి సూరి, పెద్ద కాలువ వినోద్‌కుమార్, మద్దికేర బాషా, రంగనాయకులు, చాకలి సుంకన్న, గౌస్, సాలేహ, బికె అన్వర్, బికె రహీం, సల్లు, బాబాసాహెబ్, రమణ, తాటిచెర్ల సుబ్బరాయుడు, బసిరెడ్డి లక్ష్మి, సింగరప్ప, మీసాల రామచంద్ర, బాలకృష్ణ, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ జాయింట్ కలెక్టర్ సచిన్‌రహార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలోని రికార్డులు, ఓపి వివరాలు, ఏపి మెడిసిన్ వేస్తున్నారు.. ప్రజలకు అందుబాటులో ఏ టాబ్లెట్లు ఉన్నాయనే విషయాలను డాక్టర్ శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యంలో ధర్నా

పుట్లూరు : రైతులకు సబ్సిడీ శనగలు పంపిణీ చేయాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకె శైలజానాథ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని రైతులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వపు విద్యార్థుల చేయూత

బెలుగుప్ప : తాము చదివిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.1.60లక్షల విరాళం అందజేశారు. గూడూరు హరికృష్ణయాదవ్, గూడూరు శరత్, ఎజి శ్రీనివాసరెడ్డి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ప్రమీలమ్మ, కుమారుడు అనిల్ కలిసి ఉపాధ్యాయులకు సంబంధిత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

నార్పల : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల నివారణకు బుధవారం మండల కేంద్రంలో ఫాగింగ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలువీధుల్లో ఫాగింగ్ చేపట్టారు.

'మాంటిస్సోరీ'లో అవగాహన సదస్సు

రాప్తాడు : మండలంలోని గొల్లపల్లి గ్రామం మాంటిసోరి స్కూల్ నందు అవేర్నెస్ ప్రోగ్రాంను ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జెడి లక్ష్మీనారాయణ దేశ, విదేశాల్లో అభివృద్ధి ఎలా ఉందన్న దానిపై అవగాహన కల్పించారు. అలాగే అనంతపురం నుంచి ఎన్నికైన గొప్ప నాయకులు, వ్యక్తులు, వివిధ స్థావరాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎండి భరత్, ప్రిన్సిపాల్ ప్రతాపరెడ్డి, ప్రిన్సిపల్ మధు, కరస్పాండెంట్ కృష్ణసమీరా, ఎండి కృష్ణభరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పుట్లూరు : మండల కేంద్రంలో ట్రాన్స్‌కో అధికారులు ఎట్టకేలకూ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో కరెంటు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజలు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

రాయదుర్గం రూరల్ : బుధవారం ఎయిడ్స్ నివాణ సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని ఉడేగోళం గ్రామంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఇంకా ఏమైనా సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1097ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం నాగమణి, ఇందిరమ్మ, లక్ష్మి, పరమేశ్వర పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

రాయదుర్గం : 'భారత రాజ్యాంగం' అనే అంశంపై నియోజకవర్గ స్థాయిలో బుధవారం రాయదుర్గంలో నిర్వహించిన పోటీల్లో కణేకల్ మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హేమలత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించింది. అనంతరం విద్యాశాఖ అధికారులు విద్యార్థినికి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకట రమేష్, భవానీశంకర్, సనోవర్ బాషా, లక్ష్మన్న, సోమశేఖర్, వేణుగోపాల్, షరీఫ్, ప్రధానోపాధ్యాయురాలు జయప్రద, కమిటీ సభ్యులు పి.రఘురాం, అబ్దుల్ బారి, శాంసన్, హేమలత, తదితరులు నిర్వహించారు.

31 నుంచి అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

అనంతపురం : ఈనెల 31 నుంచి వచ్చేనెల 2వతేదీ వరకూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అనుబంధ అంతర్ కళాశాలల గ్రూప్-ఎ పోటీలు వాలీబాల్, సాఫ్ట్‌బాల్, చెస్, బాల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఎస్వి డిగ్రీ, పిజి కళాశాలలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నటు లతెలిపారు.

కొనసాగిన సిఎఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో ఉద్యోగోన్నతికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ఇంటర్వ్యూలు బుధవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అధ్యక్షతన వివిధ విభాగాల అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో డిఎపి ఎస్వి సత్యనారాయణ, ఇంటర్వ్యూ ప్యానల్స్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి దోహదపడాలి

యల్లనూరు : విద్యార్థులు స్వతహాగా ఎదుగుతూ సమాజాభివృద్ధికి పాటుపడాలని మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలో తిమ్మంపల్లి జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, విద్యార్థులతో కలిసి పులివెందుల సూపర్ మార్కెట్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు భవిష్యత్తుకు మార్గాన్ని చూపిస్తుందన్నారు. కావున విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ స్వతహాగా ఎదుగుతూ సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌మార్కెట్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో బ్రెయిన్ స్ట్రోక్ నివారణ

రాయదుర్గం : ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య జీవనశైలి మార్చుకుంటే బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా నివారించుకోవచ్చని మలేరియా రాయదుర్గం సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగాబుధవారం పట్టణంలోని 17, 18వ సచివాలయ పరిధిలో ఉన్న శాంతినగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఆరోగ్య సహాయకులు సూర్యనారాయణ, ఆరోగ్య కార్యదర్శులు లలిత, వనజాక్షి, ఆశా కార్యకర్తలు గౌరి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో రైతు మృతి


పెద్దన్న (పాతచిత్రం)

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన రైతు పత్తికొండ పెద్దన్న (72) బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దన్న తనపొలంలో సాగు చేసిన వరి పైరుకు నీళ్లు పెట్టేందుకు భార్య తో కలిసి ఉదయం పొలానికి వెళ్ళాడు. ఈనేపథ్యంలో మోటారు వైరును తగిలించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

గుత్తి పారిశ్రామికవాడలో చోరీ

గుత్తి : పట్టణంలోని పారిశ్రామికవాడలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు పారిశ్రామిక వాడలో ఉన్న సోలార్ పవర్ ప్లాంట్ లోకి చొరబడి రూ.7 లక్షల విలువైన కేబుల్ వైర్ల లో ఉన్న కాపర్ ను అపహకరించుకెళ్లారు. సుమారు 10 వేల మీటర్ల కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై సోలార్ పవర్ ప్లాంట్ టెక్నీషియన్ వెంకటరాముడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.